క్లుప్తంగా

అనుమతి తప్పనిసరి

అన్నపురెడ్డిపల్లి: గణేష్ మండపాలకు విద్యుత్ శాఖ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని మండల విద్యుత్ శాఖ అధికారి సాయి తరుణ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండపాలకు అనుమతి లేకుండా అక్రమ విద్యుత్ వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండపాల వద్ద విద్యుత్ వైర్లు వేలాడదీయడం ద్వారా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, మండపాల నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ అనుమతికి నగదును డీడీ రూపంలో చెల్లించి, అనుమతి పొందాలన్నారు.

జర్నలిస్ట్‌పై దాడికి నిరసన



ఆందోళన చేస్తున్న విపక్షాల నాయకులు

బూర్గంపాడు: మణుగూరులో జర్నలిస్ట్ బీఆర్ఎస్ నాయకుల దాడులను నిరసిస్తు విపక్షాలు, జర్నలిస్ట్ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం సారపాకలో ఆందోళన చేపట్టారు. సారపాక ప్రధానకూడలిలో రాస్తారోకో నిర్వహించారు. అధికార పార్టీ నాయకుల దాష్టీకాలను ప్రజాస్వామ్యవాదులు ఐక్యంగా తిప్పి కొట్టాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ ఆందోళన కార్యక్రమంలో కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ, బీఎస్పీ, సీపీఐ, సీపీఎం, జర్నలిస్ట్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జనాభా ప్రకారం వాటా

భద్రాచలంటౌన్: తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు, రాజకీయ లబ్ధిలో జనాభా దామాషా ప్రకారం వాటా ఇవ్వాలని బహుజన్ సమాజ్ పార్టీ భద్రాచలం నియోజకవర్గ ఇన్‌చార్జ్ యాసం సిద్ధార్థ పూలే అన్నారు. పట్టణంలో బహుజన్ సమాజ్ పార్టీ అధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ పునర్ విముక్తి ప్రతిజ్ఞ దివాస్ సందర్భంగా ఆదివారం పార్టీ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఇర్ప రవి దొర, రఘు, దామోదర్‌రావు, రమణ, వీరస్వామి రాంబాబు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

దుమ్ముగూడెం: లచ్చిగూడెం గ్రామంలో నెల కొన్న సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని సీపీఎం శాఖ కార్యదర్శి పెనుబల్లి ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో గుంతలుతో ఉన్న బీటీ రోడ్డుకు మరమ్మతులను తక్షణమే చేపట్టాలని, డ్రైయినేజీ నిర్మాణం వెంటనే చేపట్టాలని కోరారు. సీపీఎం నాయకులు నిమ్మల మధు, ఎంపీటీసీ పెనుబల్లి సీతమ్మ, సరియం ప్రసాద్, శీలం రమేష్, ఆపక చిన్నయ్య, అర్జున్, అపక శంకర్, వార్డు సభ్యులు అపక నాగమణి పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన

చర్లరూరల్: గిరిజన విద్యార్థులకు భవిష్యత్ మార్గదర్శకాలపై అవగాహన కల్పిస్తున్నట్లు.. తద్వారా ఉన్నత స్థాయికి చేరేందుకు దోహదపడుతుందని మండలంలోని పెద్ద మిడిసిలేరు గిరిజన సంక్షేమ శాఖ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళ తెలిపారు. నిర్మాణ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యాన పాఠశాలలో ఆదివారం అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ.. అవగాహన సదస్సులతో భవిష్యత్‌కు ఉన్న అవకాశాలను వివరిస్తారని తెలిపారు. ఆతర్వాత విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ వార్డెన్ అనురాధ, నిర్మాణ్ ఆర్గనైజేషన్ కౌన్సిలర్లు కళింగ, సాయిబాబా, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

పరామర్శ

అశ్వాపురం: మండల పరిధిలోని మిట్టగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం నియోజకవర్గ అధికార ప్రతినిధి మామిళ్ల రాము ప్రమాదవ శాత్తు కింద పడి గాయపడగా ఆదివారం బీఆర్ఎస్ పార్టీ మండల యువజన అధ్యక్షుడు గద్దల రామకృష్ణ పరామర్శించి ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. నాయకులు జూపల్లి కిరణ్, రాయపూడి అశోక్, మేకల భాస్కర్, రావుల అజయ్, కన్నెబొయిన వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగ



ప్రమాదకరంగా ఉన్న 33/11 కేవీ తీగ

అశ్వాపురం: మండల పరిధిలో అమెర్ద గ్రామ సమీపంలో డబుల్‌బెడ్రూం ఇళ్ల సముదాయం వద్ద 33/11 కేవీ విద్యుత్ తీగ ప్రమాదకరంగా మారింది. విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ నుంచి డబుల్‌బెడ్రూం ఇళ్లకు విద్యుత్ సరఫరా చేసే 33/11 కేవీ విద్యుత్ తీగ తెగి పడే స్థాయిలో కట్ అయి ఉంది. దీంతో ఎప్పుడు తీగ తెగి ఏ ప్రమాదం జరుగుతుందో అని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందికి చెప్పినప్పటికీ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగను మార్చాలని కోరుతున్నారు.

తెలంగాణ విమోచన దినోత్సవం

- బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహణ
- పలుచోట్ల జెండాలు ఆవిష్కరణ

చర్లరూరల్: బీజేపీ చర్ల మండల శాఖా ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర విమోచన దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆ పార్టీ నియోజకవర్గ కోకన్వీనర్ బిట్రగుంట క్రాంతి కుమార్ మాట్లాడుతూ.. నిజాం నవాబుల నుంచి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను తెలంగాణ సాధించిన రోజని, భారత దేశానికి స్వాతంత్ర్యం 1947 ఆగష్టు 15 నాడు వస్తే, తెలంగాణ లో మాత్రం 1948 సెప్టెంబరు 17న వచ్చిందని అన్నారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు సంతపురి సురేశ్, మండల అధ్యక్షులు నక్కా కన్నారావు, ఉపాధ్యక్షులు ముత్తారం రత్తయ్య, ప్రధాన కార్యదర్శిలు పుగాకు పూర్ణ చందు, ఆలెం సమ్మయ్య, ఝెడవల్లి శేషగిరి రావు, సీనియర్ నాయకులు సాధం లోకనాథం, పగడాల శ్రీధర్, యువ మోర్చా నాయకులు రాచకొండ అనిల్ కుమార్, బోడిక సోమరాజు, ముత్యాల తాతాజీ, కారం సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



భద్రాచలంటౌన్: జెండా ఆవిష్కరిస్తున్న కుంజా సత్యవతి

దుమ్ముగూడెం: బీజేపీ దుమ్ముగూడెం మండల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర విమోచన దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని నడికుడి గ్రామంలో జాతీయ పతాక ఆవిష్కరణ చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తెల్లం శేఖర్, కుర్సం వసంతరావు, కాకా రాంబాబు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం తెలంగాణ విమోచన దినోత్సవం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు, మహబూబాబాద్ పార్లమెంటు కన్వీనర్, ఐకార్ మెంబర్ ముస్కు శ్రీనివాసరెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు తాటిపాముల అయిలయ్య, నాయకులు సురకంటి లింగారెడ్డి, కొల్లు లింగారెడ్డి, సురకంటి గంగారెడ్డి, జాలె రవీందర్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



అశ్వాపురం: మొండికుంటలో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న శ్రీనివాసరెడ్డి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో బీజేపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కుంజా సత్యవతి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు బెహారా, మండల అధ్యక్షుడు రామ్మోహన్ రావు, సుబ్బారావు, వెంకన్న, కేశవ్, కోటేశ్వరి, చక్రవర్తి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వనాలను పరిరక్షించుకోవాలి



డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలిస్తున్న రేగా కాంతారావు

బూర్గంపాడు: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలు, బృహత్ పల్లె ప్రకృతి వనాలను పరిరక్షించుకోవాలని ప్రభుత్వ విప్ రేగా కాంతారావు సూచించారు. సారపాక పల్లె ప్రకృతి వనాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం పల్లె ప్రకృతివనాలతో గ్రామాల్లో చిట్టడవులను ఏర్పాటు చేసి ఆహ్లాదకర వాతావరణం కల్పిస్తోందన్నారు. అన్ని గ్రామపంచాయతీల్లో నర్సరీలను ఏర్పాటు చేసి ప్రభుత్వం ప్రతిఏటా మొక్కలను నాటిస్తున్నామన్నారు. ప్రజలందరూ హరితహారంలో నాటిన మొక్కల పరిరక్షణకు బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మణుగూరు జెడ్పీటీసీ సభ్యులు పోశం నర్సింహారావు, పూజారి కృష్ణ పాల్గొన్నారు.

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్రంలో అనారోగ్యాలకు గురై ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న నిరుపేదలకు సీఎం సహాయనిధి అండగా నిలుస్తోందని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. మణుగూరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ముత్యాలమ్మనగర్ గ్రామానికి చెందిన పగిళ్ల శోభకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.48వేల విలువ గల చెక్కును ఎమ్మెల్యే రేగా కాంతారావు చేతుల మీదుగా ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మణుగూరు జెడ్పీటీసీ పోశం నర్సింహరావు, సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షుడు ముత్యంబాబు, అడపా అప్పారావు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: పట్టణంలోని ఏఎంసీ కాలనీ, మనుబోతుల చెరువులో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను విప్ రేగా కాంతారావు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు ఇళ్లు ఇవ్వాలనే లక్ష్యంలో భాగంగా.. మరోవారంలో ఇళ్లు పంచే కార్యక్రమం చేపడతామని, పట్టణ అభివృద్ధికి సీఎం కేసీఆర్ కట్టుబడి ఉన్నారని పేర్కొన్నారు. భద్రాద్రి అభివృద్ధి పనులు జరగాలంటే బీఆర్ఎస్‌ను బలపరిచి తెల్లం వెంకట్రావు గెలుపునకు కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆర్డీఓ మంగీలాల్, జెడ్పీటీసీలు నర్సింహారావు, సీతమ్మ, దుమ్ముగూడెం ఎంపీటీసీ రేసు లక్ష్మి, రాజారావు, శ్రీనివాసరెడ్డి, నవాబ్, శ్రీను, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు శిక్షణా తరగతులు



శిక్షణా తరగతుల్లో పాల్గొన్న న్యాయవాదులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో ఐటీడీఏ ప్రాంగణంలోని పీఆర్సీ భవనంలో రాష్ట్ర ఆదివాసీ న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి హాజరైన ఆదివాసీ న్యాయవాదులకు రెండు రోజులు శిక్షణా తరగతులు నిర్వహించారు. శిక్షణా తరగతులకు రాష్ట్ర ఆదివాసీ సంఘ అధ్యక్షుడు చీమల నరసింహారావు అధ్యక్షత వహించగా సీనియర్ న్యాయవాది, రచయిత, పరిశోధకులు పల్లా త్రినాథరావు ఏజెన్సీ చట్టాలపై అవగాహన కల్పించారు. క్రిమినల్ చట్టాలపై విశ్రాంత పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోట దేవదానం శిక్షణ ఇచ్చారు. రెండో రోజు జరిగిన శిక్షణ తరగతులకు ముఖ్యఅతిథిగా భద్రాచలం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎంవి.రవీంద్రనాథ్ హాజరై రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం తీర్పులతో సహా ఎల్టీఆర్ చట్టాలపై న్యాయవాదులకు అవగాహన కల్పించారు. శిక్షణ తరగతులకు 30 మంది ఆదివాసీ న్యాయవాదులు హాజరు కాగా ఆదివాసీ న్యాయవాది పాయం రవి వర్మ వందన సమర్పణ చేశారు.

సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



అశ్వారావుపేటరూరల్: సభకు తరలివెళ్లిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

దమ్మపేట: హైదరాబాద్‌లోని తుక్కుగూడలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన విజయభేరి బహిరంగసభకు కాంగ్రెస్ శ్రేణులు భారీగా కార్లలో తరలివెళ్లారు. ఆదివారం మండల పరిధిలోని కాంగ్రెస్ శ్రేణులు, పొంగులేటి అనుచరులు వందల సంఖ్యలో వెళ్లారు. కార్ల ర్యాలీ కార్యక్రమాన్ని కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు జారే ఆదినారాయణ జెండా ఊపి ప్రారంభించారు.

అశ్వారావుపేటరూరల్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తలపెట్టిన విజయభేరి సభకు అశ్వారావుపేట నుంచి ఆ పార్టీ నాయకులు, శ్రేణులు తరలివెళ్లారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల నుంచి కార్లలో ఆపార్టీ నాయకుడు జ్యేష్ఠ సత్యనారాయణ ఆధ్వర్యంలో తరలివెళ్లారు. నాయకులు వగ్గెల హేమంత్, మాజీ సర్పంచ్ పాట్బా రాజులు, కారం ఎర్రయ్య, భూక్యా శ్రీరామ్మూర్తి వెళ్లిన వారిలో ఉన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి

విశ్వకర్మ జయంతి వేడుకలను ఆదివారం పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘం, కార్పెంటర్స్ యూనియన్ ఆధ్వర్యంలో విరాట్ విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పతాక ఆవిష్కరణలు చేశారు. పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో పూజలు, అభిషేకాలు చేసి, తీర్థప్రసాదాలను అందించారు. అక్కడక్కడ ర్యాలీలు తీశారు. బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



దమ్మపేట: విశ్వబ్రాహ్మణుల బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు



అశ్వారావుపేటరూరల్: వినాయకపురం ఆలయం వద్ద విశ్వకర్మ జయంతి వేడుకలు



భద్రాచలంటౌన్: విశ్వకర్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కళాశాలలో చేరేందుకు చివరి అవకాశం

మణుగూరురూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలనుకునే విద్యార్థులు ప్రభుత్వం దోస్త్ ద్వారా కల్పిస్తున్న చివరి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మణుగూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ బి.శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ కళాశాలలో బీకాం, బీఎస్సీ, బీజెడ్సీ విభాగాల్లో ఖాళీలు ఉన్నాయని తెలిపారు. అర్హత గల విద్యార్థులు సంబంధిత ధృవపత్రాలతో ఆన్‌లైన్ ధరఖాస్తు చేసుకుని అడ్మిషన్లు పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వేధింపులపై కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని గోడాలవారి వీధికి చెందిన ఈశ్వరి అనే మహిళను గత కొంత కాలంగా ఆమె భర్త అప్పలచారి మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేస్తున్నాడని ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. టౌన్ ఎస్సై మధుప్రసాద్ కేసు నమోదు చేశారు.

మోదీ జన్మదిన వేడుకలు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణ బీజేపీ కమిటీ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భగా మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కుంజా సత్యవతి కేక్‌కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో బీజేపీ కార్యకర్తలు రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు బెహారా, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రావు, సుబ్బారావు, వెంకన్న, కేశవ్, కోటేశ్వరి, చక్రవర్తి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు

చండ్రుగొండ: ఎస్సీ వర్గీకరణ బిల్లుకు పార్లమెంటులో చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు రెండోరోజు ఆదివారం కొనసాగాయి. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి చాపలమడుగు వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు నారపోగు మధు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

చండ్రుగొండ: మండలంలోని తిప్పనపల్లి గ్రామంలో 50 మంది యువకులు కాంగ్రెస్ నుంచి టీఆర్ఎస్‌లో చేరారు. ఆదివారం పెద్ద ఎత్తున ద్విచక్రవాహనాలు, ఆటోల్లో ర్యాలీ నిర్వహించిన అనంతరం దమ్మపేటకు వెళ్లారు. ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లంకా విజయలక్ష్మి, రైతుబంధు మండల సమన్వయకర్త గాదే లింగయ్య, మాజీ సర్పంచ్ జి.రమేష్, ఎస్‌కె.రఫీ, ఎస్‌కె.గఫార్ ఉన్నారు.

విజయవంతం చేయాలి

దుమ్ముగూడెం: మండలంలో ప్రత్యేక పారిశుద్ధ్య వారోత్సవాలైన స్వచ్ఛత్ హి సేవా-2023ను విజయవంతం చేయాలని ఎంపీడీఓ ముత్యాలరావు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ఆదివారం ప్రగళ్లపల్లి పంచాయతీలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు నెల 17వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ జుంజురి లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరి, ప్రజలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి వినతి

అన్నపురెడ్డిపల్లి: తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరుతూ అంబేడ్కర్ విగ్రహానికి వద్ద అంగన్‌వాడీ టీచర్లు, మినీ టీచర్లు, హెల్పర్లు వినతిపత్రంతో ఆదివారం నిరసన తెలిపారు. మరోవైపు స్థానిక ప్రజాప్రతినిధులకూ వినతిపత్రాలు ఇచ్చి మద్దతు తెలపాలని కోరారు. కనీస వేతనం రూ.26 వేలు, మినీ టీచర్స్‌ని మెయిన్‌టీచర్స్‌గా గుర్తించాలని, ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భారతి, శివ, విజయ,కుమారి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మాటికీ విద్రోహ దినమే..

కమ్యూనిస్టు పార్టీల నాయకులు

చర్ల: సెప్టెంబర్ 17 వేలాది మంది హిందూ, ముస్లిం ప్రజాఉద్యమకారులను ఊచకోత కోసి భూస్వాములకు, జమిందారులకు లక్ష ఎకరాల భూమిని అప్పగించిన రోజైన సెప్టెంబర్ 17 ముమ్మాటికీ విద్రోహ దినమేనని సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ భద్రాచలం సబ్ డివిజన్ కార్యదర్శి ముసలి సతీష్ అన్నారు. ఆదివారం చర్లలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణా రైతాంగ సయుధ పోరాటంతో నిజాం రాజాకార్లపై తిరుగుబాటు చేసి కమ్యూనిస్టులు వీరోచిన పోరాటాలు చేశారన్నారు. ఈ పోరాట స్ఫూర్తిని ప్రజల ఆలోచనల్లో నుంచి తీసివేసేందుకు విమోచన దినం పేరిట హడావిడి చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో నాయకులు లక్ష్మి, రామ నర్సయ్య, ఉదయరాజు, ప్రసాద్ పాల్గొన్నారు.



అశ్వారావుపేటరూరల్: మాట్లాడుతున్న ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కెచ్చెల రంగారెడ్డి

అశ్వారావుపేటరూరల్: తెలంగాణ సాయుధ పోరాటాలతో సంబంధం లేని రాజకీయ పార్టీలు చరిత్రను వక్రికరిస్తున్నాయని, కానీ సెప్టెంబర్ 17 ముమ్మాటికీ విద్రోహ దినమేనని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కెచ్చెల రంగారెడ్డి అన్నారు. స్థానిక పార్టీ ఆఫీసులో ఆదివారం జరిగిన జనరల్ బాడీ సమావేశానికి ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంతో సంబంధం లేని బీజేపీ.. హిందూ, ముస్లిం సెంటిమెంట్‌ను రెచ్చగొట్టే దిశగా తెలంగాణ విమోచన దినాన్ని తెరపైకి తీసుకురావడాన్ని ఖండించారు. పార్టీ నాయకులు అమర్లపూడి రాము, నూపా భాస్కర్, కల్లూరు కిషోర్, గోగినపల్లి ప్రభాకర్, వాసం బుచ్చిరాజు, కుర్సం ముత్యాలరావు, గోనెల రమేష్, కల్లూరి పద్మ పాల్గొన్నారు.

తెలంగాణను నిర్మించింది కమ్యూనిస్టులే..

భద్రాచలంఅర్బన్: నిజాం రాజుకు వ్యతిరేకంగా దొరలు, దేశముఖ్‌లు, రజాకారులను తరిమికొట్టి, స్వేచ్ఛాయుత తెలంగాణను నిర్మించింది కమ్యూనిస్టులేనని సీపీఐ పట్టణ కార్యదర్శి అకోజు సునీల్ కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, అణగారిన వర్గాల కోసం ముఖ్యంగా రైతాంగ సమస్యల కోసం, రజాకారుల రాజకీయ పాలనను అంత మొందించడంలో సీపీఐ కీలకపాత్ర పోషించిందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మరెడ్డి శివాజీ, లంకపల్లి విశ్వనాథ్, ఎస్ఎస్ నాయుడు, శోభన్, కొలిపాక శివ, నాగ సాయి తదితరులు పాల్గొన్నారు.



చర్ల: సమావేశంలో మాట్లాడుతున్న ముసలి సతీష్

లయన్స్ క్లబ్ అన్నదానం



చిన్నారులకు అన్నదానం చేస్తున్న భద్రాచలం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెంకటరెడ్డి

భద్రాచలంఅర్బన్: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక కహల్ అనాథ బాలల సదనంలో క్లబ్ మెంబర్ పద్మనాభుని వాసు–గీతల కుమారుడు దర్శిత్ పుట్టిన రోజు సందర్భంగా చిన్నారులకు అన్నదానం నిర్వహించారు. అలాగే చిన్నారులకు స్టేషనరీ సామగ్రి అందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు భీమవరపు వెంకటరెడ్డి, కోశాధికారి భరత్ కుమార్, బిల్లిపెల్లి రంగారెడ్డి, దాట్ల శ్రీనివాసరాజు, పంజా సునీల్, పి.రవి, కే. జయరాజు, శ్రీధర్, సర్వేశ్వరరావు, పద్మనాభుని రవి, వాసు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఆత్మ విశ్వాసంతోనే ఉన్నత లక్ష్యాలు

బూర్గంపాడు: ప్రతి ఒక్కరూ ఆత్మ విశ్వాసంతో కృషి చేస్తే ఉన్నత లక్ష్యాలను ఆలవోకగా చేరుకోవచ్చని సాహితీవేత్త, వ్యక్తిత్వ వికాస నిపుణులు పరిటాల విష్ణుమూర్తి అన్నారు. సారపాకలోని బ్రిలియంట్ స్కూల్‌లో ఆదివారం విద్యార్థులకు ప్రేరణ తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతు నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు క్రమశిక్షణ, మంచి నడవడికలతో ముందుకు సాగాలన్నారు. తమ ఆలోచనా సరళి, భావాలను వ్యక్తపరుస్తూ వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఎటువంటి క్లిష్ట సమయంలోనైనా మానసిక స్థైర్యాన్ని కోల్పోవద్దన్నారు. ఈ సందర్భంగా ఆయనను పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో బ్రిలియంట్ స్కూల్ కరస్పాండెంట్ బి.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవరాత్రులకు మండపాలు సిద్ధం



మణుగూరుటౌన్: వినాయక మండపం కోసం రోడ్డుపై ఏర్పాటు చేసిన షామియానాలు



దుమ్ముగూడెం: మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న శ్రీకాంత్

దుమ్ముగూడెం: వినాయక నవరాత్రులు నిర్వహించడానికి మండలంలో పలు గ్రామాల్లో మండపాలను సిద్ధం చేశారు. నేటి నుంచి తొమ్మిది రోజులపాటు అంగరంగ వైభవంగా వినాయక నవరాత్రి ఉత్సవాలను నిర్వహించడానికి ఉత్సవ కమిటీలు ఏర్పాటు చేశారు. మండపాల వద్ద క్లాత్ డెకరేషన్‌తో విద్యుత్ అలంకరణలతో మండపాలను సంసిద్ధం చేశారు. లక్ష్మీ నగరం గ్రామంలోని నటరాజ్ సూపర్ మార్కెట్ నిర్వాహకులు వాకచర్ల గౌరి శంకర్, శ్రీకాంత్‌లు ప్రజలకు మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా అందజేశారు.

మణుగూరుటౌన్: వినాయక చవితి ఉత్సవాల సందడి మొదలైంది. భారీ విగ్రహాలు రంగులద్దుకుని విక్రయాలకు సిద్ధంగా ఉండగా, ఉత్సవ కమిటీలు షామియానాలు వేస్తూ చందాల కోసం తిరుగుతూ కమిటీ సభ్యులు పనుల్లో నిమగ్నమయ్యారు. మణుగూరు పట్టణంలో బులియన్ మర్చంట్ అసోసియేషన్, కూరగాయల వ్యాపారులు, చాంబర్ ఆఫ్ కామర్స్, గనుల్లో పీవీకాలనీ ఇలా అన్ని వర్గాలు గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిపేందుకు సిద్ధమవగా.. స్థానికంగా విగ్రహ తయారీదారుల నుంచి రూ.కోటి వరకు వ్యాపారం జరిగే అవకాశం ఉంది.

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో నవరాత్రి మహోత్సవాల సందర్భంగా గణనాథులు కొలువు దీరేందుకు ఉత్సవ కమిటీలు ఏర్పాట్లను ఆదివారం పూర్తి చేశారు. ఈ సందర్భంగా గణేష్ మండలపాలను విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసి పూలతో అలంకరించి సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. ప్రధాన మార్కెట్లలో భక్తులు గణపతి పూజ సామాగ్రి కోసం కిటకిటలాడారు. కాగా.. పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి గణపతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కంభంపాటి సురేష్, హన్సీ, పవన్‌కుమార్, యూసఫ్ మియా, నాగరాజు, రాజారామ్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాల పంపిణీ

భద్రాచలంఅర్బన్: వినాయక చవితి నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా ఆదివారం సాయి సాగర్ మెడికిల్స్ యజమాని రాంప్రసాద్ సహకారంతో భద్రాచలం పట్టణంలోని పాత మార్కెట్ ప్రజలకు మట్టితో తయారు చేసిన 300 వినాయకుడి ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పరిమి సోమశేఖర్ మాట్లాడుతూ.. మట్టి విగ్రహాల ఉపయోగాలను వివరించారు.



భద్రాచలంఅర్బన్: మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న అసోసియేషన్ కార్యదర్శి సోమశేఖర్

బూర్గంపాడు: పరుశురామ్ పరివార్ ఆధ్వర్యంలో సారపాక, తాళ్లగొమ్మూరు, గాంధీనగర్, శ్రీరాంపురం, రాజీవ్‌నగర్, భాస్కర్‌నగర్, పాత సారపాక ప్రాంతాల్లో వినాయకచవితి సందర్భంగా ఆదివారం మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పరుశురామ్ పరివార్ రాష్ట్ర అధ్యక్షుడు ముత్తవరపు రాజశేఖర్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు మట్టి ప్రతిమలను పూజిద్దామన్నారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా అధ్యక్షుడు దేవులపల్లి సాయికిరణ్, అనిల్‌కుమార్, యోగనందరెడ్డి, విజయ్ పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం, తిరుమలకుంట, అశ్వారావుపేటలో ఆదివారం మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. స్థానిక వాసవి క్లబ్, లయన్స్‌క్లబ్‌ల ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా మట్టి విగ్రహాలను అందించగా, వాటిని ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో క్లబ్ బాధ్యులు దూపకుంట దుర్గారావు, యూఎస్ ప్రకాశ్, కంచర్ల రమేష్, జూపల్లి బ్రహ్మారావు, కోటగిరి మోహన్‌రావు, చలపతిరావు, మద్దాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 భద్రాచలం కె. హరేంద్ర - 99632 02011
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎస్. దుర్గాంప్రసాద్ -79979 58226 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

యస్.రవిబాబు - 99516 02914
కె. మధు - 97059 44416